క్లుప్తంగా

నేడు ఆఖరి మంగళవారం పూజలు

అచ్చంపేట: తాళ్లచెరువు ఆర్సీఎం చర్చిలో సెప్టెంబరు ఆఖరి మంగళవారం పూజలు నిర్వహించనున్నారు. నున్నాబత్తిన భాగ్యయ్య గురుత్వం పొంది 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాలలో విచారణ గురువులు పుట్టి అంతోనిరాజు, సహ గురువులు కిరణ్, చర్చి పెద్దలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మొక్కలు నాటిన వైద్య సిబ్బంది

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం డాక్టర్ ఇన్నారావు మొక్కలు నాటారు. మొక్కలను సంరక్షించే బాధ్యతను పీహెచ్‌సీ సిబ్బంది తీసుకోవాలని ఆయన కోరారు. కదంబ, బాదం, నేరేడు, వేప, చింత, ఎర్రటి పూలనిచ్చే అగ్నిపూల మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ముప్పాళ్ళ: వర్షాభావం కారణంగా నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆరుతడులకు నీరు విడుదల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దారు ఎం.భవానిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కందిమళ్ల సాంబశివరావు, గారా జాలయ్య, కంచర్ల నాగేశ్వరరావు, తొరటి అమరలింగేశ్వరరావు, నరసింహారావు, కూరపాటి ప్రభాకర్, పఠాన్ సైదాఖాన్, తోట బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో స్వచ్ఛతయే సేవా కార్యక్రమం సోమవారం జరిగింది. ఎస్‌బీఎం మండల సమన్వయకర్త ఎం.బ్రహ్మానందం పాల్గొని పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పీలా లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

రాజుపాలెం: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. చౌటపాపాయపాలెంలో కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలు జరుగుతున్న తీరును సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామంలోని పలు గృహాలను సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని తెలిపారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌ను పరిశీలించారు. రక్త పరీక్షల వివరాలు, రికార్డులు, రిపోర్టులను తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ వెంకటకృష్ణకుమార్, డాక్టర్ రవితేజనాయక్, సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్,, సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్‌లకు సత్కారం



సత్తెనపల్లి: వైద్యశాలకు ఫార్మసిస్టులు ఒక మూల స్తంభం లాంటి వారని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్తా రామకృష్ణ అన్నారు. నేషనల్ ఫార్మసిస్ట్ డేను పురస్కరించుకొని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఫార్మసిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఫార్మసిస్టుల సేవలు అమితమైనవన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్వైజర్ విజయలక్ష్మి, గైనకాలజిస్ట్ సుజాత, ఏవో భవాని, ఫార్మసిస్టులు విజయ లక్ష్మి, పద్మావతి, కుమారి, సీమా తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com

హోరాహోరీగా స్కూల్ గేమ్స్

- క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం
- రసవత్తరంగా బాల్‌బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా పోటీలు
- బాలురతో సమానంగా తలపడుతున్న బాలికలు
- ప్రతిభ ఆధారంగా ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపికలు

క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గ్రామస్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడంతో పాటు అధికారులు వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా ప్రస్తుతం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు.



జిల్లా బాలబాలికల బాల్ బాడ్మింటన్ జట్లతో ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గత నాలుగేళ్లుగా స్కూళ్లు, కళాశాలల్లోని మైదానాలు క్రీడాకారులతో కళకళలాడుతున్నాయి. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోంది. దీనికి తోడు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు క్రీడాకారులను, క్రీడలను మరింత ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా సంబరాలు, శాప్ ద్వారా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్ -19 బాల బాలికలకు బాల్‌బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా క్రీడా పోటీలు నిర్వహించి, ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టును ఎంపిక చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వృందా మహిళా కళాశాల ఆధ్వర్యంలో ప్రగతి పాఠశాల ఆవరణలో ఎంపికలు నిర్వహించారు. పరిశీలకులుగా జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు నరసింహారావు, పద్మాకర్‌రావు వ్యవహరించారు.

భారీగా పాల్గొన్న క్రీడాకారులు..

స్కూల్ గేమ్స్ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దీంతో మైదానాలు క్రీడాకారులతో సందడిగా కనిపించింది. బాల్ బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా పోటీలకు గాను ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ఎంపికైన జట్టును ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మక్కెన అచ్చయ్య, కళాశాల డైరెక్టర్ పరిటాల నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, బి.అనిల్ దత్తానాయక్, కె.కిరణ్‌కుమార్ ప్రశంసించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసు కురావాలని ఆకాంక్షించారు.



జిల్లా బాలబాలికల సెపక్ తక్రా జట్లు

జిల్లా సెపక్‌తక్రా బాలుర జట్టు: షేక్.నాగ షరీఫ్, సయ్యద్ రౌఫ్, కె.నాగరాజు, వై.ప్రభుదాసు, పి.విజయ్‌కుమార్.

బాలికల జట్టు: సీహెచ్ జ్ఞాన శ్రీ అర్చన, ఎం.అనూష, కె.దుర్గా కోమలి, కె.మమత, కె.సాయి రూప ఎంపికయ్యారు.

జిల్లా బ్యాడ్మింటన్ బాలుర జట్టు: జి. నాగ హనుమ, ఎ.అనిల్, ఎ. వంశీ కృష్ణారెడ్డి, ఆర్‌పీ గోపి, షేక్ ఆజాద్, ఎస్కే జమీర్, ఎం.శరత్ చంద్ర, బి.సాయి నాయక్, షేక్ నజీర్, ఎస్.సాయినాథ్, స్టాండ్ బైలు షేక్ బాల సైదా, టి.గోపి, బి. గురుమూర్తి.

బాలికల జట్టు: టి. నాగరజని, డి.అశ్విని, టి.స్రవంతి, బి.భాగ్యలక్ష్మి, ఎం. అమూల్య, ఎస్. హిమజ, ఎ. దీపిక, డి. యామిని, శివలక్ష్మి, పి. జాహ్నవి, స్టాండ్ బైలు కె. సుకన్య, ఎం.శ్రీలక్ష్మి

గణనాథుడి సేవలో ఎమ్మెల్యే నంబూరు



గణపయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: స్థానిక రెడ్ల బజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి 21కిలోల లడ్డూ ప్రసాదాన్ని పీసపాడుకు చెందిన విప్పల రాజశేఖరరెడ్డి రూ.36 వేలకు దక్కించుకున్నారు. అనంతరం అత్యంత ఘనంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. అనుముల కోటిరెడ్డి, వెలది అప్పారావు, తుమ్మపూడి ప్రతాప్‌రెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, రహిమాన్, జెడ్పీటీసీ జమీలా గఫూర్, పాశం శ్రీనివాసరెడ్డి, గంజినబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

రెజ్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థులు



రెజ్లింగ్‌లో ప్రతిభకనబరచిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమార్

అచ్చంపేట: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ జట్టుకు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం ప్రిన్సిపాల్ టి.అరుణకుమార్ తెలిపారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా నున్న జెడ్పీ హెస్కూలులో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్ విద్యార్థి కె.కార్తికేయ, జూనియర్ ఇంటర్ విద్యార్థి డి.కళ్యాణ్ విశేషకనబరచి బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. బి.ఓబేదు, జి.రాజు, ఎం.శివాజి, పి.చంటి రజత పథకాలు, బి.సంతోష్, డి.కుమార్‌బాబు, ఎం.జాయ్ కాంస్య పథకాలను సాధించినట్లు వివరించారు. బంగారు పతకాలు సాధించిన కార్తికేయ, డి.కళ్యాణ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన పీడీ జి.భూషణాన్ని ప్రిన్సిపాల్, కళాశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ జి.బ్రహ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమారు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ యువతకు ఆదర్శం



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ నేతల నివాళి

అచ్చంపేట: పండిట్ దీన్ దయాళ్ జయంతిని సోమవారం అచ్చంపేటలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తమ్మా వెంగళరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి పడకండ్ల లక్ష్మాచారి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దుబ్బా సత్యనారాయణ, ఓబీసీ మండల అధ్యక్షుడు దుబ్బా సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు మోదెల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాటి వీర చరిత్ర.. మరో మహాభారతం

దుర్గి: పల్నాటి వీరచరిత్ర మహాభారతాన్ని తలపిస్తుందని ప్రముఖ సినీ గేయ రచయిత భువన చంద్ర అన్నారు. ప్రముఖ వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు రచించిన పల్నాటి శతకం పుస్తకాన్ని ప్రముఖ శిల్పి, దుర్గి నాగార్జున శిల్పశాల నిర్వాహకులు చెన్నుపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. గుంటూరులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నుపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ దుర్గిలో శిల్పకళా నైపుణ్యానికి అంతర్జాతీయంగా గుర్తింపు రావటానికి కారకులైన ఎన్ఆర్ఐ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నేటి కంప్యూటర్ యుగంలో చేతివృత్తులను మరచిపోకుండా వాటి అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కొన్ని నెలల క్రితం విశాఖపట్నంలో నిర్వహించిన గ్రేట్ సమ్మిట్‌లో తాము తయారు చేసిన అనేక శిల్పాలను ప్రదర్శించటంతో జాతీయంగా, అంతర్జాతీయంగా తమ కళకు గుర్తింపుతో పాటు అనేక మందికి ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తు చేశారు. వక్తలు పల్నాటి శతకం పుస్తకం మరో మహాభారతాన్ని గుర్తు చేస్తుందని ప్రశంసించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు చెన్నుపాటికి శుభాకాంక్షలు తెలిపారు.

బైబై గణేశా

- ఘనంగా వినాయక నిమజ్జనాలు
- అన్న సంతర్పణలు, ఊరేగింపులు, సాంస్కృతిక ప్రదర్శనలు



నిమజ్జనానికి పట్టణంలోని 15వ వార్డులో వినాయక విగ్రహం

సత్తెనపల్లి: పట్టణం, మండలంలో వినాయక నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వీధి వీధిన ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. కొన్ని వినాయక విగ్రహాలను సోమవారం నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణలు నిర్వహించారు. తీన్మార్ వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. గణపతిబప్పా మోరియా.. జై జై గణేశా బై బై గణేశా అంటూ నినదించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి



క్రోసూరు: క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లో గల కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు వద్ద టిప్పర్ లారీ ఢీకొని విద్యార్థి అంబటి రామకృష్ణ(21) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. అచ్చంపేట మండలం మిట్టపాలేనికి రామకృష్ణ స్నేహితులతో కలిసి వినాయకుడికి గజమాల కోసం క్రోసూరుకు వచ్చాడు. ఈ క్రమంలో బ్యాంకు ఏటీఎంలోకి వెళ్లి తిరిగి.. తన ద్విచక్ర వాహన్ని వెనక్కు తీస్తుండగా.. అదే సమయంలో అటుగా వేగంగా వస్తున్న టిప్పర్ లారీ వెనుక టైరు తగలటంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సత్తెనపల్లి కృష్ణవేణి కాలేజీలో డిగ్రీ చదువుతున్నట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. ఎస్ఐ పాల్‌రవీందర్ విచారణ జరుపుతున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



క్రోసూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య సర్వేను క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమాదేవి సోమవారం గుడిపాడు గ్రామంలో పరిశీలించారు. వైద్య సిబ్బందికి విధివిధానాలు వివరించారు. ఇంటింటి సర్వే అనంతరం ప్రణాళిక బద్ధంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. హెల్త్ క్యాంపుల్లో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్య పరీక్షలు అనంతరం అవసరమైతే ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు, నెట్‌వర్క్ ఆసుపత్రులకు మెరుగైన వైద్య సేవలకు పంపించడం జరుగుతుందన్నారు. ఏఎన్‌ఎంలు, వలంటీర్లకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న లార్వా సర్వేను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ సాద్, ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్, ఎస్‌యూఓ.బేగ్, సీహెచ్‌ఓ దివ్య పాల్గొన్నారు.

గణేశునికి కరెన్సీ అలంకరణ



అచ్చంపేట: స్థానిక కాకతీయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని సోమవారం రూ.5.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. రూ.500, రూ.100 నోట్లతో హారాలుగా తయారు చేసి స్వామి మెడలో వేశారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ లక్ష్యాలను చేరుకోవాలి

సత్తెనపల్లి: గ్రామ రెవెన్యూ అధికారులందరూ లక్ష్యాలను చేరుకోవాలని తహసీల్దారు ఎస్. సురేష్ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నీటి తీరువ వసూళ్లు, ఈ-క్రాప్ బుకింగ్, పట్టాదారు పాస్ పుస్తకాలకు ఆధార్ సీడింగ్, రీ-సర్వే, ఎలక్షన్ క్లెయిమ్స్ పెండింగ్ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొన్నారు.

మంచి జరిగిందని భావిస్తేనే ఆశీర్వదించండి

- ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు
- వైకుంఠపురం సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం



సచివాలయం భవన శిలాఫలకం ఆవిష్కరణలో ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మంచి జరిగిందని భావిస్తే మరలా ఆదరించాలని నర్సరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రజలతో అన్నారు. వైకుంఠపురంలో సోమవారం గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు వైఎస్సార్ సీపీ నాయకుడు భవిరిశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా గ్రామ సచివాలయం, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిలిచాయన్నారు. 520 సేవలను ప్రజల ముంగిటకు తెచ్చేందుకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జిల్లాకు రెండు కేంద్రియ విద్యాలయాలు మంజూరయ్యాయని, ఈసారి కోటాలో అమరావతికి కేంద్రియ విద్యాలయం తెస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ప్రతి మండల కేంద్రం నుంచి 30 నిమిషాలలో జాతీయ రహదారికి చేరుకునేలా రోడ్లు బాగుచేస్తున్నామన్నారు. ఈ పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ గత పాలకులు 40 ఏళ్లలో చేయలేని అభివృద్ధి పనులు నాలుగేళ్లలో చేసి చూపించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.700 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.1,350 కోట్లకు పైగా పేదలకు అందజేశామన్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఘాట్ రోడ్ నిర్మిస్తున్నామన్నారు. గతంలో పార్టీలు చూసి పథకాలు అందేవని, కానీ జగనన్న పాలనలో అర్హతను బట్టి పథకాలు అందుతున్నాయన్నారు. నాలుగేళ్లలో ఇంత అభివృద్ధి చేశామని ధైర్యంగా చెప్పడానికి జగనన్న పాలనే కారణమన్నారు. తాము మంచి చేశామని భావిస్తే.. జగనన్నకు, తమకు ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. ప్రారంభోత్సవ శిలా ఫలాకాన్ని ఆవిష్కరించారు. జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలలక్ష్మీనరసింహరావు, జెడ్పీ కో-ఆప్షన్ మెంబరు షేక్ హష్మీ, ఉప సర్పంచ్ గుబ్బా కృష్ణయ్య, మండల వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అళ్ళ శ్రీనివాసరెడ్డి, మంగిసెట్టి కోటేశ్వరరావు చిలకా సాంబయ్య, నంబూరు బాబురావు, నిమ్మా విజయ సాగర బాబు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం శ్రీనివాస్‌కు అలైఖ్య ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డికి అలైఖ్య ఐకాన్ అవార్డు -2023ని శ్రీసాయి అలైఖ్య సాంస్కృతిక సేవా సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రదానం చేసింది. విద్యా రంగంలో 27ఏళ్లుగా శ్రీనివాసరెడ్డి కృషి చేసినందుకు ఈ పురస్కారం అందజేసినట్లు నిర్వాహకుడు అరుణ అశోక్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అతిథులుగా టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, దైవజ్ఞ శర్మ, విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్, బలగం సినీ నటుడు కొరమయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు తిరుమలేష్, శ్రీనివాసరెడ్డి, ఉన్నత విద్యావేత్త శివరామయ్య సోమవారం అభినందించారు.

ఏడాది మొత్తం ఉపాధి పనులు కల్పించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నకరికల్లు: రైతులకు వ్యవసాయ పనులు లేనందున ఏడాది మొత్తం ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపి, తహసీల్దారు కె.నగేష్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ వర్షాభావం నేపథ్యంలో మండలంలో సుమారు 70 శాతం మంది రైతుల పొలాలు బీళ్లుగా మారాయన్నారు. నకరికల్లును కరువు మండలంగా ప్రకటించి, రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఈవూరి అప్పిరెడ్డి, ఈవూరి లక్ష్మారెడ్డి, జి.వెంకటరమణ, ఎస్. రామాంజనేయులు నాయక్, గుంజా ఏడుకొండలు, షేక్ లాలూ, ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



సత్తెనపల్లి: కవి కోకిల గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 9, 10వ తరగతి విద్యార్థులకు గబ్బిలం - యితివృత్తం - జాషువా దృక్పథం అనే అంశం మీద, సీనియర్ విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాషువా పద్యాలు - విశిష్టత అనే అంశం మీద వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 155 మంది విద్యార్థులు పాల్గొన్నారని, విశేష స్పందన లభించిందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు యిర్మీయా, సురేష్ బాబు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ నెల 28న జాషువా 128వ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ సభ్యుడు కోటేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొల్లవరం లడ్డు.. రూ.75 వేలు

బొల్లవరం(ముప్పాళ్ళ): బొల్లవరం గ్రామంలోని రామాలయం వద్ద వినాయక మండపంలో పూజలందుకున్న లడ్డూ ప్రసాదం వేలంలో రూ.75లు పలికింది. సోమవారం నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గాదె సురేంద్రరెడ్డి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ
న్యాయవాదులు, పెదకాకాని రోడ్, గుంటూరు.
9080595227, 9848052914

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ)

బంగారు నగల బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను దిగువ తెలిపిన వారు తమ బాకీలను చెల్లించియుండలేదు. కుదువ చెల్లించవలసిన కాలం గడిచినందున సదరు బంగారు నగలు ది.30-09-2023 శనివారం మధ్యాహ్నం 1 గంటలకు బ్రాంచ్ ఆవరణలో బహిరంగ వేలం వేసి వారి పేరున ఉన్న బకాయిలను జమ చేసుకొనబడును. వేలంలో పాల్గొనదలచిన వారు ది.30-09-2023 శనివారం మధ్యాహ్నం 1 గంటలోపు రూ.5,000/- ను ధరావత్తు చెల్లించవలయును. వేలం పాడినవారు 3% GST చెల్లించవలెను. ఎట్టి కారణము చూపకుండానే వేలంను రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము గలదు. వేలం వేసినను బకాయిలు మిగిలియున్న యెడల వారిపై చట్టరీత్యా తగు చర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తించును. నోటీసులు తిరస్కరించిన వారికి ఈ పత్రికా ముఖముగా చివరగా తెలియజేయడమైనది.

క్ర.సం.	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	నికర తూకం (గ్రాములు)
		కుంకలగుంట బ్రాంచ్ - 9390478329	
1	702980088185226	అవుదూరి కోటేశ్వరమ్మ, భర్త బ్రహ్మారెడ్డి, కుంకలగుంట	44.60
2	702980088165141	అవుదూరి బ్రహ్మారెడ్డి, తండ్రి రామిరెడ్డి, కుంకలగుంట	45.10
3	702980088188669	షేక్ మీరాసాహెబ్ తండ్రి చిన్నమీరాసాహెబ్, కుంకలగుంట	19.60
		గుండ్లపల్లి బ్రాంచ్ - 9100910479	
1	703380049158274	చింతపల్లి హసూర్ బీ, భర్త హుస్సేన్, గుండ్లపల్లి	27

తేది : 22-09-2023
సం/- బ్రాంచ్ మేనేజర్